సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని చినవాల్తేరు ప్రాంతానికి చెందిన సాయిదీప్‌శర్మ రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దాతకు బాండ్‌ని ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆటో



ప్రమాదంలో నుజ్జయిన ఆటో

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో మంగళవారం ఉదయం కారును ఓ ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హోటల్ అంబికా సీ గ్రీన్ నుంచి వస్తున్న కారు ఆర్కే బీచ్ వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా... అదే సమయంలో ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తోపాటు ముగ్గురు మహిళా ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆటో ముందు భాగం పూర్తిగా నుజ్జుకాగా కారు పాక్షికంగా దెబ్బతింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కి చెందిన 11 సంవత్సరాల బాలిక ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అడ్డుకుని చెయ్యి పట్టుకుని బలవంతంగా బైకు పైకి ఎక్కించడానికి ప్రయత్నించాడు. దీంతో భయపడిన బాలిక అతని బారి నుంచి తప్పించుకుని ఇంటికెళ్లి తల్లిదండ్రులకు విషయం వివరించింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఫోక్సో చట్టం సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో మహిళా ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయనగరం జిల్లా జామికి చెందిన ఎర్రినాయుడు(45)గా గుర్తించారు.

లడ్డూ @ రూ.4.5 లక్షలు



గణపతికి నివేదించిన 50 కిలోల లడ్డూ

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ సమీపంలో గల ఆక్సిజన్ టవర్స్ అపార్ట్‌మెంట్ ఆవరణలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వినాయకుని ప్రసాదమైన 50 కిలోల లడ్డూ వేలం పాటలో భక్తులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. చివరికి లడ్డూని అపార్ట్‌మెంట్‌కి చెందిన హర్ష రూ.4.50 లక్షలకి వేలం పాడారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆక్సిజన్ టవర్స్ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్



రోడ్డుపై పార్క్ చేసిన కార్లు

పార్కింగ్ స్థలాలే ఫుడ్ కోర్టులు

రోడ్డుమీదే వాహనాల పార్కింగ్



రోడ్డుపై పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు



పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన కుర్చీలు

సాగరతీరాన్ని వీక్షించేందుకు వచ్చే సందర్శకుల కోసం జీవీఎంసీ అభివృద్ధి చేసిన పార్కింగ్ స్థలాలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు అడ్డాగా మారాయి. దీంతో సందర్శకులు వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. వారాంతంలో సాయంత్రం సమయంలో మరింత సమస్యగా మారుతోంది. కనీసం సందర్శకులు నడిచి వెళ్లేందుకు కూడా మార్గం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి. తీరంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఫుడ్ కోర్టులకు జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకున్న నిర్వాహకులు వారికిచ్చిన స్థలంతో పాటు దానిని ఆనుకుని ఉన్న స్థలాన్ని కూడా ఆక్రమించుకుని వ్యాపారాలను కొనసాగించడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇంత జరుగుతున్నా అటు జీవీఎంసీ అధికారులు గానీ, ఇటు పోలీస్ అధికారులు గానీ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

- బీచ్‌రోడ్డు

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

- పోరాడి, సాధించాలి
- కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం: సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. జీవితం ఎంతో విలువైందని, దానిని చేజార్చుకోవద్దని సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినాన్ని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితం ఓ ప్రయాణమని, ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతాయని అన్నారు. ధైర్యంగా నిలబడి వాటిని ఎదుర్కోవాలే గానీ, తొందరపాటుతో ముగించవద్దని హితవు పలికారు. సైక్రియాటిస్ట్ బి.నిత్య ఐశ్వర్య మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని బద్దలు చేయాలన్నారు. ఈ రోజుల్లో ప్రతి 20 సెకండ్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ శాతం యువత ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణకై సమాజంలో మార్పు తీసుకురావాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. మానసిక ఇబ్బంది ఉన్న వారు గవర్నమెంట్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 4 4 16 ద్వారా మానసిక వైద్యుల సలహాలు, కౌన్సెలింగ్ పొందవచ్చని జాతీయ సేవా పథకం అధికారి పోలా ఉమామహేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి, జి.వి.ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్..



సరిచేసిన విద్యుత్ దీపం

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి దుర్గానగర్‌లో రాత్రీపగలూ వెలుగుతున్న విద్యుత్ దీపాలను ఆ విభాగం అధికారులు సరిచేశారు. వార్డు పరిధి దుర్గానగర్‌లో ఐదు రోజుల నుంచి సుమారు 20 విద్యుత్ దీపాలు రాత్రీపగలూ వెలుగుతున్నాయి. ఇక్కడ 85/బి/6 నంబరు గల విద్యుత్ స్తంభం నుంచి వరుసగా 20 స్తంభాలకు ఉన్న దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దీనిపై పగటి సమయంలో కూడా విద్యుత్ వృథా చేస్తున్నారని 'పట్టపగలే విద్యుత్ వెలుగులు' శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురించిన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. దుర్గానగర్‌లో నిరంతరం వెలుగుతున్న విద్యుత్ దీపాలను మంగళవారం పరిశీలించి... అక్కడి ఎంసీబీని సరి చేయించారు. దీంతో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

త్రీటౌన్ సీఐగా రమణయ్య



బీచ్‌రోడ్డు : త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐగా పల్లా రమణయ్యను నియమించినట్లు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రమణయ్య గతంలో ఎంవీపీ పోలీసు స్టేషన్, గోపాలపట్నం, సీసీఆర్‌బీలో సీఐగా పనిచేశారు. అలాగే ఎస్ఐగా 2006లో మూడో పట్టణ పోలీసు స్టేషన్ లోనే శిక్షణ పొందారు. ప్రస్తుతం త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐగా పనిచేస్తున్న పార్థసారథి గాజువాక పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఘనంగా దీపాలంకరణ వేడుక



నేతాజీనగర్‌లో వినాయక మండపం వద్ద దీపాలంకరణ



విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: స్థానిక పిఠాపురం కాలనీ సమీప నేతాజీనగర్‌లో ఎన్‌వై బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం దీపాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలంకరణ చేశారు. అనంతరం గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో వాడవాడలా వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కాలనీలతోపాటు అపార్టుమెంట్లలో ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుతున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 13వ వార్డు పరిధి దారపాలెంలో అల్లూరి సీతారామరాజు వ్యాలీ రెసిడెన్సియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అపార్టుమెంట్ వాసులు రోజూ విఘ్నేశ్వరుడికి నైవేద్యం సమర్పించి పూజలు చేస్తున్నారు. సమీపంలోని పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం కాలనీల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు.

వేట సాగక.. పూట గడవక..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు మత్స్యకారుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. వేట సాగక, పూట గడవక కష్టాల కడలిలో ఆటుపోట్ల మధ్య వారి జీవనం భారంగా సాగుతోంది. ప్రకృతి ప్రకోపించినా.. అండగా ఉండాల్సిన ప్రభుత్వమూ చేయూతనివ్వకపోవడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

- కష్టాల కడలిలో గంగపుత్రులు
- తరచూ ప్రకృతి వైపరీత్యాలతో మత్స్యవేటకు దూరం
- అందని ప్రభుత్వ భరోసా



తీరానికి పరిమితమైన బోట్లు



ఉప్పాడ వద్ద తీరానికి పరిమితమైన వలలు



మంగమారిపేట వద్దే ఉంచేసిన వలలు, బోట్లు

కొమ్మాది: మత్స్యకారులకు వేటే జీవనాధారం. ఒడిదుడుకులెన్ని వచ్చినా.. ఎదురీది నిలబడగల కష్టజీవులు. వీరి జీవితంలో ఆటుపోట్లు నిరంతర ప్రక్రియ. గంగమ్మను నమ్ముకున్న బతుకులు వారివి. అలాంటివారిపై ప్రకృతి ఒకవైపు, ప్రభుత్వం మరోవైపు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. దీంతో, వేట లేక పూట గడవక మత్స్యకారులు పస్తులుండాల్సిన పరిస్థితి.

సముద్రంలో వేట నిషేధ సమయం ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు రెండు నెలల పాటు మత్స్యకారులు వృత్తికి దూరమై ఇంటికే పరిమితమయ్యారు. నిషేధ కాలం పూర్తయ్యేసరికి ప్రకృతి పరీక్ష పెడుతోంది. జూలై, ఆగస్టులలో రెండు సార్లు తుపాన్లు, సముద్రంలో వాయుగుండం కారణంగా 15 రోజుల పాటు వేటకు దూరమయ్యారు. తాజాగా వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా మత్స్యకారులు సముద్రానికి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం వరదల కారణంగా సముద్రం పెద్ద ఎత్తున ఎగసి పడటంతో మరో వారం రోజుల పాటు వేటకు వెళ్లలేని పరిస్థితి.

పట్టించుకోని ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు విరామ భృతి రూ. 10వేలు అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకార భరోసాకు మంగళం పాడింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20వేలు విరామ భృతి ఇస్తామని మత్స్యకారులపై ప్రభుత్వం ఆశల వల విసిరింది. తీరా అధికారంలోకి వచ్చాక అసలు భరోసా ఊసే మరిచిపోయింది. ఆరు నెలల నుండి వాయుగుండాలతో పోరాటం చేస్తూ, వేటవిరామంతో పస్తులు ఉంటూ అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నా మత్స్యకారులు.

రుషికొండ తిమ్మాపురం, మంగమారిపేట, కాపులదిబ్బడపాలెం, చేపలుప్పాడ తీరప్రాంతంలో వందలాది మత్స్యకార కుటుంబాలు వేటను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నాయి. మత్స్యకార భరోసా దేవుడెరుగు.. కనీసం తుపాను సమయంలోనైనా తాము ఎలా ఉన్నామో చూడటానికి ఒక్క ప్రజా ప్రతినిధికూడా రాలేదని ఇక్కడ మత్స్యకారులు వాపోతున్నారు. వరుస తుపాన్లతో బతుకే భారంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే రూ. 10వేలు చొప్పున మత్స్యకార భరోసా తమ ఖాతాల్లో పడేవని, తుపాను సమయాల్లోనూ ఆదుకునేవారని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్స్యకార భరోసా అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

శ్రీ కొత్తమ్మకు మేయర్ ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు అప్పుఘర్ గ్రామ దేవత శ్రీ కొత్తమ్మకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 29 వరకు నిర్వహించే అమ్మవారి పండగ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీ భరత్‌తో కలిసి ఆమె పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ కొత్తమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. విపత్తుల నుంచి నగర ప్రజలను కాపాడాలని కోరారు. నగరం అభివృద్ధి జరిగేలా పాలన ముందుకు సాగేందుకు అమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక మహిళలు బీచ్‌కు వెళ్లి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు ఊరేగింపుగా అమ్మవారి సేవకు నీళ్లు తీసుకొచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గొలగాని మంగవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

యూడైస్‌లో వివరాలు నమోదు చేయకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు యూడైస్‌లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చినగదిలి, సీతమ్మధార మండలాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లతో మంగళవారం విశాఖ వేలీ స్కూల్‌లో యూడైస్ – 2024 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూడైస్‌లో పాఠశాలలు, వాటిలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను సక్రమంగా, సకాలంలో నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన అనంతరం ఎలాంటి తప్పులు ఉన్నా ఇచ్చిన గడువులోగా మళ్లీ సరి చేసుకోవాలని తెలిపారు. లేదంటే అప్‌లోడు చేసిన తర్వాత సరిద్దుకోవడానికి అవకాశం ఉండదన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి చెందినదని, అందుకే అప్‌లోడు చేసిన అనంతరం సరిచేసుకోవడానికి అవకాశం ఉండదని తెలిపారు. యూడైస్‌లో ఉన్న విధంగా సరైన సమాచారం నింపని పాఠశాలల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, ఏపీవో అప్పలనాయుడు, సీతమ్మధార ఎంఈవో రామారావు, ఏఎస్‌వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కోలుకున్న మానసిక రోగి ఏయూటీడీ షెల్టర్‌కు అప్పగింత



జితేంద్ర సాహును షెల్టర్ ప్రతినిధులకు అప్పగిస్తున్న డాక్టర్ రాజేష్ తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ మెంటల్ కేర్ హాస్పిటల్‌లో కొన్ని నెలలుగా చికిత్స పొందుతున్న మానసిక రోగి పూర్తి స్థాయిలో కోలుకున్నట్లు డాక్టర్ రాజేష్ వెల్లడించారు. గత ఫిబ్రవరిలో విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మానసిక స్థితి బాగోలేని జితేంద్ర సాహు అనే వ్యక్తిని ఏయూటీడీ షెల్టర్ మేనేజర్ భాస్కరరావు గుర్తించి షెల్టర్‌కు తరలించారు. అనంతరం షెల్టర్ కార్యదర్శి ప్రగడ వాసు సూచన మేరకు చికిత్స నిమిత్తం వాల్తేర్‌లోని విశాఖ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స అందించడంతో కొద్ది నెలల్లో జితేంద్ర సాహు కోలుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడిని డాక్టర్ రాజేష్ ఏయూటీడీ షెల్టర్ ప్రతినిధులకు తిరిగి అప్పగించారు. త్వరలోనే అతని సమాచారం కుటుంబ సభ్యులకు తెలియజేసి అప్పగిస్తామని షెల్టర్ ప్రతినిధులు పేర్కొన్నారు. మెరుగైన వైద్యం అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలి



తగరపువలసలో నిరసన తెలుపుతున్న నాయకులు

మధురవాడ: ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే కుట్రలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రజా, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మధురవాడ జోనల్ కార్యాలయం ఎదురుగా గల హైవే సర్వీసు రోడ్డులో మంగళవారం నిరసన తెలిపారు. దీంతో రాకపోకలకు కాసేపు ఇబ్బంది కలిగింది. పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలకు పూనుకుందని, ఇది రాష్ట్రానికి అన్యాయం చేయడమే అవుతుందని అన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, జి.మంగశ్రీ, లక్ష్మణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలి

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా భీమిలి డివిజన్ సిటూ నాయకులు స్థానిక మెయిన్‌రోడ్డులో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రవ్వ నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడవలసిన ప్రభుత్వమే ప్రైవేట్‌పరం చేయడం సరికాదని, దీనిని ప్రజాసంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కేంద్రం వైఖరి మార్చుకోకుంటే ప్రజలే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్నారు. నమ్మి నాయుడు, పల్లా పెంటరాజు, జోగ వెంకటరావు, పల్లా రమణ, పల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ సర్వే నంబరు 346/2లో కొంతమంది రైతులు కొద్ది సంవత్సరాలుగా గేదెలను, మేకలను కట్టుకుని వాడుకలో ఉన్నారు. అయితే ఇటీవల వీరు ఈ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయడం, పాకలు వేయడంతో.. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. సుమారు మూడు ఎకరాల్లో కంచెలను, పాకలను తొలగించి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో అనేక ఆక్రమణలు ఉన్నాయని, వీటిని పరిశీలించి త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

49 మంది డ్రైవింగ్ లైసెన్సుల రద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ద్వారకా పోలీసులు రోజూ స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలలో తీసుకొచ్చిన మార్పులు ఈ నెల ఒకటి నుంచి అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వాహనదారులకు హెల్మెట్ లేకపోవడం, వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ లేకుండా వుంటే కేసులు నమోదు చేసి తాత్కాలికంగా డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్టేషన్ పరిధిలో గల ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, ఆశీలుమెట్ట, రామాటాకీస్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 49 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి. భాస్కరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 400 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు.